
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 11 డిసెంబరు 2025

నేడే తొలి పోరు





....;పోలింగ్ కేంద్రం పోలింగ్ సిబ్బంది

- మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం
- 122 పంచాయతీలు, 1,172 వార్డు స్థానాలకు ఎన్నికలు
- తొలివిడత 4 సర్పంచ్, 349 వార్డు స్థానాలు ఏకగ్రీవం

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తొలి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో ఏడు మండలాల్లో మొదటి విడతలో 122 సర్పంచ్, 1,172 వార్డు స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఒంటి గంట వరకు లైన్‌లో నిల్చున్న ఓటర్లకు మాత్రమే టోకెన్లు అందిస్తారు. ఆ తర్వాత వచ్చిన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ఏడు మండలాల్లో ఎన్నికలు

తొలి విడతలో 122 సర్పంచ్, 1,172 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు 1,172 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోరుట్ల డివిజన్‌లోని మేడిపల్లి మండలంలో 12 సర్పంచ్, 120 వార్డు సభ్యుల స్థానాలకు, భీమారం మండలంలోని 13 సర్పంచ్, 18 వార్డు సభ్యుల స్థానాలకు, కథలాపూర్ మండలంలోని 23 సర్పంచ్, 212 వార్డు సభ్యుల స్థానాలకు, కోరుట్ల మండలంలోని 15 సర్పంచ్, 152 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లోని మెట్‌పల్లి మండలంలోని 15 సర్పంచ్, 152 వార్డు సభ్యుల స్థానాలకు, ఇబ్రహీంపట్నం మండలం లోని 17 సర్పంచ్, 162 వార్డు సభ్యుల స్థానాలకు, మల్లాపూర్ మండలంలోని 23 సర్పంచ్, 220 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలను తొలి విడతలో నిర్వహించనున్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రకాశ్

సర్పంచ్ బరిలో 461 మంది అభ్యర్థులు

తొలి విడతలో నాలుగు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా 118 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందుకు 461 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అదే విధంగా 1,172 వార్డు స్థానాలకు రెండు స్థానాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. 349 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 821 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా 1,952 మంది పోటీ పడుతున్నారు.

పోలింగ్ సిబ్బంది ఇలా...

జిల్లాలో తొలి విడతలో 1,406 మంది పీఓలు, 2,005 మంది ఓపీఓలు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇందులో మేడిపల్లిలో 144 మంది పీఓలు, 204 మంది ఓపీఓలు, భీమారంలో 142 మంది పీఓలు, 204 మంది ఓపీఓలు, కథలాపూర్‌లో 226 మంది పీఓలు, 341 మంది ఓపీఓలు, కోరుట్లలో 182 మంది పీఓలు, 292 మంది ఓపీఓలు, మెట్‌పల్లిలో 254 మంది పీఓలు, 341 మంది ఓపీఓలు, ఇబ్రహీంపట్నంలో 194 మంది పీఓలు, 287 మంది ఓపీఓలు, మల్లాపూర్‌లో 264 మంది పీఓలు, 380 మంది ఓపీఓలు విధులు నిర్వర్తించనున్నారు. పలువురు నోడల్ అధికారులు, స్టేజ్ - 1 రిటర్నింగ్ ఆఫీసర్లు, స్టేజ్ - 1 ఏఆర్‌ఓలు, స్టేజ్ - 2 ఆర్‌ఓలకు ఎన్నికల బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలైన్స్ బృందం అధికారులు పనిచేయనున్నారు.

1,172 పోలింగ్ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా తొలి విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా 1,172 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మేడిపల్లిలో 120 పోలింగ్ కేంద్రాలు, భీమారంలో 118, కథలాపూర్‌లో 188, కోరుట్లలో 152, మెట్‌పల్లిలో 212, ఇబ్రహీంపట్నం 162,

మిగతా 8వ పేజీలో



మెట్‌పల్లి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బస్సులో వెళ్తున్న సిబ్బంది



కోరుట్లలో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేశా

- ఆశీర్వదించండి : చల్‌గల్ సర్పంచ్ అభ్యర్థి జున్ను రాజేందర్



జున్ను రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న ఓటర్లు , జున్ను రాజేందర్(ఇన్‌సెట్‌లో)

జగిత్యాలరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలో మాజీమంత్రి జీవన్‌రెడ్డి సహకారంతో గతంలో నిరుపేదలకు 20 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంతో పాటు తన సొంత ఖర్చులతో ఇళ్ల వద్దకు రహదారి నిర్మాణం చేపట్టానని చల్‌గల్ సర్పంచ్ అభ్యర్థి జున్ను రాజేందర్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్‌లో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో రాజేందర్ గెలుపుబాటలో కొన సాగుతున్నట్లు గ్రామ ప్రజలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం చల్‌గల్ గ్రామంలో రాజేందర్ ఎన్నికల ప్రచారం నిర్వహించగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.ఈ మేరకు రాజేందర్ మాట్లాడుతూ గ్రామంలో రైతులు ఇబ్బందులు పడుతుంటే అన్ని వ్యవసాయ పొలాల వద్దకు ట్రాక్టర్స్ ఓనర్ల సహకారంతో మట్టి రహదారి నిర్మాణం చేపట్టానని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి మరింత జరగాలంటే ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను సర్పంచ్‌గా గెలిపించాలని జున్ను రాజేందర్ చల్‌గల్ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

పోలింగ్ విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర పంచాయతీ ఎన్నికల అబ్జర్వర్ రమేష్



మెట్‌పల్లి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆర్‌వోలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న సర్పంచ్, వార్డు ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఈసీ నిబంధనలు సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీ ఎన్నికల అబ్జర్వర్ రమేష్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో జరగనున్న తొలివిడత పోలింగ్ ఎన్నికల సామగ్రిని పట్టణంలోని జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి రఘువరణ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమయ పాలన పాటిస్తూ, అప్రమత్తతో ఎన్నికలు నిర్వహించాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, పోలింగ్ మెటీరియల్ జాగ్రత్తగా ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బాల్యలెట్ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులను పరిశీలించాలన్నారు. ఓటింగ్ అనంతరం లెక్కింపులో ఎలాంటి నిష్పక్షపాతం పాటించాలని, ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా తగినంత కోరం ఉందా లేదా అన్నది పరిశీలించుకోవాలని పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల అధికారులు పోలింగ్ సామగ్రి తీసుకున్న అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

కెనాల్ పూడ్చి మట్టి తరలింపు

వెల్గటూర్, డిసెంబరు 03 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో ఎస్సారెస్పీ డీ53 కెనాల్‌ను పూడ్చి మట్టిని తరలించడం చర్చనీయాంశంగా మారింది. ఓ వ్యక్తి మట్టిని తరలించడానికి ఎస్సారెస్పీ కెనాల్ అడ్డుగా ఉందని ఏకంగా కెనాల్‌ను పూడ్చి దారిని ఏర్పాటు చేసుకుని మరీ మట్టిని తరలించాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలించడానికి కెనాల్‌ను పూడ్చడం పట్ల తహశీల్దార్ శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల వారీగా బ్యాలెట్ పత్రాల కేటాయింపు

కొడిమ్యాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల అధికారులు గ్రామాల వారీగా బ్యాలెట్ పత్రాల కేటాయింపులో అధికారులు, సిబ్బంది బిజీబిజీగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, ఎంపీవో భగవాన్ రెడ్డి, సూపరింటెండెంట్ సురేష్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

కోరుట్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలను నిర్వహించడానికి ఎన్నికల సిబ్బంది బుధవారం పోలింగ్ కేంద్రాలకు బయలు దేరి వెళ్లారు. కోరుట్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన సామగ్రి స్వీకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో పోలింగ్ కేంద్రాలకు బయలు దేరి వెళ్లారు. కోరుట్ల మండలంలో 15 గ్రామ పంచాయతీలతో పాటు 120 వార్డు సభ్యుల ఎన్నికకు అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలంలో 3 జోనులుగా విభజించి 9 రూట్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ కొరకు 15 మంది రిటర్నింగ్ అధికారులు ఉండంగా పీఓలు 152, ఓపీఓలు 243 మందిని ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాటు చేసారు. మండలంలో 15 గ్రామ పంచాయితీలకు సర్పంచ్ కొరకు 57 మంది పోటీ పడగా 120 వార్డులకు 293 మంది పోటీలో ఉన్నారు. 152 వార్డులు ఉండగా అధికారులు 120 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీరిలో 32 మంది ఎకగ్రీవం అయ్యారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కౌంటర్‌ను అదనపు కలెక్టర్ రాజాగౌడ్, డీపీఓ రేవంత్, కోరుట్ల ఆర్‌డీఓ జీవకర్ రెడ్డిలువ పర్యవేక్షించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు సలహాలను అందించారు.

- కోరుట్ల సర్కిల్ పరిధిలోని మూడు పోలీస్‌స్టేషన్ 24 రూట్లుగా ఏర్పాటు చేసిన పోలీసులు ప్రత్యేకం పర్యవేక్షించన్నట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. ఇద్దరు డీఎస్‌పీ స్థాయి అధికారులతో 6 గురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలు 340 మంది సిబ్బందితో ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించనున్నారు. కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 11 గ్రామాలు సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు సిఐ తెలిపారు. ప్రతి నిత్యం 24 రూట్లలో ప్రత్యేక మొబైల్ వాహనాల ద్వారా పోలీసు పెట్రోలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సిఐ తెలిపారు.



కోరుట్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



మల్లాపూర్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ఇబ్రహీంపట్నం: తొలిదశ స్థానిక సంస్థల పోరుకు రంగం సిద్ధమైంది. బుధవారం పలు శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ బ్యాలెట్ బాక్సుల పరిశీలన, పనితీరు తదితర అంశాలపై అధికారులు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల పంపిణీ సామగ్రి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ లత, ఎన్నికల సంఘం అబ్జర్వర్ రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసిల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ గణేష్, ఎస్ఐ అనిల్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డ్యూటీ నిర్వహణపై ఎస్ఐ అనిల్ పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే ఎన్నికల బ్యాలెట్ పనితీరుపై మరోసారి పరిశీలించి, పలువురు సిబ్బంది కేంద్రాలకు తరలివెళ్లారు. అలాగే ఎన్నికల వేళ ఎలాంటి గొడవలు, ఘర్షణలు చోటుకు తావివ్వకుండా ఎస్ఐ అనిల్ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల వేళ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత ఎవరూ కూడా రోడ్లపై ఉండరాదని, గుంపులుగా సంచరించవద్దని తెలిపారు. అలాగే పార్టీలతో సంబంధం లేకుండా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ఆయా అభ్యర్థులు సంయమనం పాటించి ఎన్నికలు సజావుగా సాగేలా సహకారం అందించాలని కోరారు. అదనపు ఎస్పీ మండల కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన నేపథ్యంలో మండలంలో మరింత భద్రత కట్టుదిట్టం చేశారు.



ఇబ్రహీంపట్నం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద విధులకు హాజరైన సిబ్బంది

సకాలంలో చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్: ఎన్నికల సిబ్బందికి కేటాయించిన ప్రత్యేక వాహనాల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలను సకాలంలో చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. బుధవారం మల్లాపూర్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.

ఎమ్మెల్యే సహకారంలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

- నర్సింహులపల్లి సర్పంచ్ అభ్యర్థి సృజన సుశీన్



ప్రచారం నిర్వహిస్తున్న సృజన సుశీన్ , సృజన సుశీన్ (ఇన్‌సెట్‌లో)

బీర్‌పూర్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి సర్పంచ్ అభ్యర్థిగా తాజా మాజీ ఎంపీటీసీ విద్యావంతురాలైన ఎడ్ల సృజన సుశీన్ బరిలో నిలిచారు. సృజన డిగ్రీ చదవగా ఆమె భర్త బీటెక్ ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరు విద్యావంతులే కాగా కార్పొరేట్ కంపెనీల్లో లక్షల జీతం ఖరీదైన జీవితం అనుభవించే అవకాశాలు ఉన్నప్పటికీ గ్రామంపై ఉన్న అభిమానం, గ్రామాభివృద్ధిపై ఉన్న తపనతో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సర్పంచ్ బరిలో నిలిచారు. ఒక్కసారి అవకాశం ఇస్తే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సహాయ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రచారం చేస్తున్నారు. విద్యావంతులైన యువ సర్పంచ్ అభ్యర్థి సృజన సుశీన్ వెంటే మేము న్నామంటూ యువత సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఉంగరం గుర్తు గెలుపు ఖాయం అనే చర్చ గ్రామంలో జోరుగా సాగుతోంది. తాను ఎంపీటీసీగా ఉన్న కాలంలో గ్రామానికి ఎంతో సేవ చేశానని గ్రామ ప్రజలు ఆశీర్వదించి ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని సృజన సుశీన్ అభ్యర్థిస్తున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు

కోరుట్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు సిబ్బంది, అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంను అడిషినల్ ఎస్పీ శేషాద్రి రెడ్డి, మెట్‌పల్లి డిఎస్‌పీ రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్‌పీ ఆశోక్ కుమార్ పోలీసులకు పలు సూచనలు సలహాలను అందించారు. ఎన్నికల కేంద్రంలో అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కోరుట్ల సీఐ సురేష్‌బాబు తదితరులున్నారు.

- మెట్‌పల్లి రూరల్ : ఓటర్ల స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని అధికారులకు ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. బుధవారం మెట్‌పల్లి జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ చేస్తున్న కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రాలు, భద్రత తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లను బెదిరించడం, భయపెట్టడం చేయవద్దన్నారు. ఓటర్లు సెల్‌ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూత్‌లోనికి తీసుకెళ్లరాదని, ఎవరైనా చట్టరీత్యా కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, డీఎస్పీలు రాములు, వెంకటరమణ, సీఐ అనిల్ కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎస్పీ, పోలీసులు

దళిత, గిరిజన, ఆదివాసీలకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం : జీవన్‌రెడ్డి

రాయికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, ఆదివాసీలకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని బోర్నపల్లి గ్రామం మరాఠా కాలనీలో సద్గురు ఫూలాజీ బాబా ఆధ్యాత్మిక సత్సంగ్ వార్షిక మహోత్సవ వేడుకలకు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫూలాజీ బాబా చూపిన ఆధ్యాత్మిక, ధ్యాన సన్మార్గాలు ఎంతో గొప్పవన్నారు. సమాజంలో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఆధ్యాత్మిక సన్మార్గాన్ని చూపిన మహానీయుడని తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయేతర పనుల నిమిత్తం బోర్నపల్లి గ్రామానికి వచ్చిన మరాఠాల కాలనీలో ప్రభుత్వపరంగా కల్పించాల్సిన సదుపాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రకృష్ణారెడ్డి, గోపి రాజరెడ్డి, కొడిపెల్లి ఆంజనేయులు, తంగెళ్ల రమేష్, జలపతి, మహిపాల్ ఉన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- కొడిమ్యాల అభ్యర్థి గడ్డం జీవన్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి జీవన్‌రెడ్డి , జీవన్‌రెడ్డి(ఇన్‌సెట్‌లో)

కొడిమ్యాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : గ్రామ ఓటర్లు కత్తెర గుర్తుకు ఓటువేసి ఆశీర్వదిస్తే కొడిమ్యాల గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి గడ్డం జీవన్‌రెడ్డి బుధవారం ఇంటింటా తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించాడు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సహకారంతో గ్రామ బస్టాండ్ సమీపంలోని చిలుకవాగును ప్రక్షాళన చేసి కాల్వకు ఇరువైపులా సైడ్‌వాల్ నిర్మాణం చేయిస్తానన్నారు. బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకవచ్చి ప్రజా మరుగుదొడ్లను నిర్మింప చేస్తానన్నారు. గ్రామంలో వీధిదీపాలు, మురికినీటి కాల్వల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. కొడిమ్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని 18 పడకలకు పెంచటంతో పాటుగా మహిళలకు గైనకాలజిస్టు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. కొడిమ్యాల పట్టణంలో ఎమ్మెల్యే సహకారంతో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఇందిరానగర్‌కాలనీ నుంచి నాచుపల్లి బ్రిడ్జి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానన్నారు. గ్రామంలో కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటానని జీవన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు.

ట్రాక్టర్ ఢీకొని చికిత్స పొందుతూ ఒకరి మృతి


రాజయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని జాఫర్‌ఖాన్ పేటలో జరిగింది. గ్రామానికి చెందిన చీదురు రాజయ్య(50) ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడం కోసం మండలంలోని ఇదిలాపూర్ గ్రామానికి చెందిన అల్లం రమేష్ ట్రాక్టర్‌తో మట్టి తరలిస్తున్నాడు. గతనెల 23నఇంటి నిర్మాణానికి మట్టి తరలిస్తుండగా అల్లం రమేష్ కుమారుడు అల్లం శేష్ కుమార్ ట్రాక్టర్ నడుపుతూ చీదురు రాజయ్యను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన రాజయ్యను కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ రాజయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కోరుట్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామానికిచెందిన గోపిడి హన్మక్క(82) అనేవృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ చిరంజీవి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగురోజుల క్రితం హన్మక్క గ్రామంలో తనఇంట్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో హన్మక్కకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతిచెందింది. హన్మక్క అల్లుడు హన్మంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

చొప్పదండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి చెందిన కటుకం శరత్ చంద్ర(39) అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులతో కరీంనగర్ విద్యానగర్‌లో నివాసం ఉంటున్న శరత్‌చంద్ర మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా పని చేస్తున్నాడు. దీంతో పాటు బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలతో అప్పులు పెరిగిపోయాయి. హుజూరాబాద్‌లో పని ఉందని మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరాడు. తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. స్వగ్రామం చొప్పదండిలోని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు గుర్తించారు. శరత్ చంద్ర భార్య దివ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

ముస్తాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేరువేరుగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మండలంలోని మోర్రాయిపల్లె గ్రామానికి చెందిన అకారం అరుణ్ వద్ద రూ.8వేల విలువ చేసే మద్యం, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన పాతూరి బాల్‌రెడ్డి వద్ద రూ 3వేల విలువచేసే మద్యాన్ని పట్టుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.

వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనకాలగల కాలనీలో బొజ్జ శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన మద్యంను బుధవారంరాత్రి ఎస్ఐరామ్మోహన్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.లక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

చందుర్తి: మండలం నర్సింగాపూర్‌లో బండి శ్రవణ్ కుమార్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యంను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు చందుర్తి ఎస్సై రమేష్ తెలిపారు. మొబైల్ పోలీస్ పార్టీ ఆధ్వర్యంలో 17బీర్లు పట్టుకున్నాట్లు పేర్కొన్నారు. మద్యం విలువ రూ.4000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘం నాయకుల నిరసన

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి మాట్లాడుతూ దేశ జనాభాలో సుమారు 63శాతం బీసీలు ఉన్నా నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. బీసీలకు42శాతం రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ఈ బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యలో 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


న్యూఢిల్లీ జంతర్మంతర్‌లో నిరసన తెలుపుతున్న తెలంగాణ బీసీ నాయకులు

పోలింగ్ ఏజెంట్లే కీలకం



- గ్రామ ఓటర్లనే నియమించుకోవాలి
- వార్డుల్లో వార్డు ఓటరే ఉండాలి
- దొంగ ఓట్లను గుర్తించేది స్థానికులే..

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంటే కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డుకు పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థి, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్‌ను నియమించుకోవాలి. సదరు ఓటర్లను గుర్తించేది ఏజెంట్లే కావడంతో సర్పంచ్‌గా పోటీ చేసే ప్రతి అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి కీలకమైన వ్యక్తిని ఏజెంట్‌గా నియమించుకుంటేనే వారి గెలుపు సాధ్యమవుతుంది. సర్పంచ్ పదవికి పోటీ చేసే వ్యక్తులు ఏ వార్డు నుంచైనా వార్డు మెంబర్ అయితే ఏ వార్డు నుంచి పోటీ చేస్తున్నారో అదే వార్డుకు సంబంధించిన ఓటరును పోలింగ్ ఏజెంట్‌గా నియమించుకోవాలనే నిబంధన ఉంది. ఏదైనా కారణాల వల్ల ఇతరులను నియమించుకోవాల్సి వస్తే ముందే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రాతపూర్వకంగా తెలియజేయాలి. దానిని పరిశీలించి అనుమతి ఇస్తే తప్ప ఇతరులను నియమించుకునేందుకు వీలు లేదు.

● ఏజెంట్ల వివరాలు రిటర్నింగ్ అధికారికి పంపాలి...

సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి స్క్రూటినీ పూర్తి కాగానే ఏజెంట్‌గా నియమించుకునే వ్యక్తి అంగీకార పత్రాన్ని రాత పూర్వకంగా డూప్లికేట్ కాపీతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపించాలి. పరిశీలన అనంతరం రిటర్నింగ్ అధికారి నియామక పత్రంపై ఆమోదం తెలుపుతూ సంత కం చేసి ఒక కాపీని ఏజెంట్‌కు అందజేస్తారు.

● కౌంటింగ్ ఏజెంట్ల నియామకం

ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో మొదట వార్డుల వారీగా కౌంటింగ్ ఏజెంట్లను నియమించి కౌంటింగ్ నిర్వహిస్తారు. కౌంటింగ్ ఏజెంట్ గా వచ్చేవారు ప్రభుత్వ ఉద్యోగి, పలు రాజకీయ పదవులు చేసిన వారు అనర్హులు. వీరిని తప్ప ఎవరినైనా ఏజెంట్లుగా నియమించుకోవచ్చు.

● ఓటర్లను గుర్తించేది ఏజెంట్లే...

ప్రతి వార్డులో ఆ వార్డుకు సంబంధించిన ఓటరు వచ్చినప్పుడు ఎన్నికల సిబ్బంది ముందుగా క్రమ సంఖ్యతో పాటు అతని పేరు సరి చూసుకున్న తరువాతనే ఓటరుకు వేలుపై ఇంక్ పెట్టి బ్యాలెట్ పేపర్ అందజేస్తారు. ఓటరుకు బ్యాలెట్ పేపర్ అందించిన తర్వాత ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేసినా ఎన్నికల అధికారి దానిని పరిగణలోకి తీసుకోరు. ఎవరైనా ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేస్తే ప్రిసైడింగ్ అధికారి సమక్షంలో విచారణ జరిపిన తర్వాతే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

నోడల్ అధికారికి తీవ్ర గాయాలు


గాయపడిన నోడల్ అధికారి వినోద్‌కుమార్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద జడ్పీ సీఈవో, ఎన్నికల నోడల్ అధికారి వినోద్‌కుమార్ కింద పడగా తీవ్ర గాయాలపాలయ్యాడు. బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎన్నికల అబ్జర్వర్ రవికుమార్‌తోకలిసి వినోద్‌కుమార్ తిరిగి వెళుతుండగా సిమెంట్ దిబ్బకు తట్టుకొని కిందపడ్డాడు. దీంతో తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడేఉన్న వైద్యసిబ్బంది ప్రాథమికచికిత్స అనంతరం మెరుగైనచికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నోడల్ అధికారి వినోద్ కుమార్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్‌వాల్ పరామర్శించి చికిత్స చేస్తున్న వైద్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దీంతో వినోద్‌కుమార్ స్థానంలో వెంటనే వేములవాడ మండల నోడల్ అధికారిగా శ్రీనివాసరావును నియమించారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఒకరికి జరిమానా

పాలకుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తీగల రాములు అనేవ్యక్తి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించినందుకు పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ మంగమ్మ బుధవారం తెలిపారు. గతంలో పాలకుర్తి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్‌చేయగా, నిబంధనలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించినందుకు జరిమానా విధించామన్నారు. ఎవరైనా నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

ఆలయంలో దేవతా ప్రతిమలు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామశివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలో దేవతల ప్రతిమలు బుధవారం దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. స్వామివారి చిత్రపటాలతోపాటు పీటలు పూర్తిగా కాలిపోయాయని పేర్కొన్నారు. ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. దేవతలప్రతిమలు దగ్ధంపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నామని పోలీసులు వివరించారు.

గుడిసె దగ్ధం

● రూ.20 వేల ఆస్తి నష్టం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని ఒడ్డెర కాలనీలో బత్తుల దేవవ్వకు చెందిన గుడిసె బుధవారం దగ్ధమైంది. గుడిసె సమీపంలోని పొలంలో ఓ రైతు కొయ్యకాళ్లకు నిప్పు పెడుతున్న క్రమంలో మంటలు వ్యాపించాయి. గుడిసెలోని దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. బత్తుల దేవవ్వ కుటుంబ సభ్యులు మరో గుడిసెలో ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పినట్లయింది. సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు దేవవ్వ పేర్కొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్, నాగర్‌కర్నూలు జిల్లా మామిళ్లపల్లెకు చెందిన అతినారపు అలివేలు(38)ల మధ్య ఉన్న వివాహేతర సంబంధమే ఆమె హత్యకు దారి తీసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్‌లతో కలిసి హత్యకేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు మండలి నరేష్ ఉపాధి కోసం తన భార్య పిల్లలతో కలిసి హైదారాబాద్ సుచిత్రలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉండేవాడు. సుమారు 5సంవత్సరాల క్రితం నిందితునికి మృతురాలు అతినారపు అలివేలుతో పరిచయం ఏర్పడింది. మృతురాలుకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబంలోని గొడవలతో ఆమె తన భర్తతో విడాకులు తీసుకున్నది. ఈ క్రమంలో ఆమెకు నరేష్‌తో ఏప్పడిన పరిచయం ఏర్పడింది. వీరి అక్రమ సంబంధం నిందితుడి భార్యకు తెలియగా, ఆమె సుమారు 2 సంవత్సరాల క్రితం తన తల్లి తండ్రుల వద్దకు వెళ్లి పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నది. ఈ క్రమంలో మృతురాలు తన భార్యపిల్లలను వదిలి తనను పెళ్లి చేసుకోవాలని నిందితున్ని తరుచూ ఇబ్బంది పెడుతుండేది. అంతే కాకుండా నిందితుని స్వగ్రామం స్తంభంపల్లికి వెళ్లి గొడవ చేస్తుండేది. కాగా 2024లో వీరిద్దరికీ డబ్బులు అవసరం ఉండగా మంచిర్యాలలో కూస లక్ష్మి అనే మహిళను ఇద్దరు కలిసి హత్యచేసి ఆమెవద్ద ఉన్న బంగారం దొంగిలించారు. హత్య కేసును ఛేదించిన మంచిర్యాల పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు. ఇద్దరు జైలు నుంచి మూడు నెలలక్రితం విడుదల అయ్యారు. మృతురాలు అలివేలు మంగళవారం స్తంభంపల్లి గ్రామంలోని నరేష్ ఇంటికి వచ్చి తనను పెళ్లి చేసుకోవాలని లేదంటే నాచావుకు మీరే కారణమని ఉత్తరం రాసి ఇంటి ముందు ఉన్న బావిలో దూకి చచ్చిపోతానని బెదిరించింది. దానితో నరేష్ ఎలాగైనా ఆమె అడ్డు తొలగించుకోవాలని అక్కడే ఉన్న రోకలిబండతో అలివేలు తలపై బలంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఎస్సై ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి కేసును దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మండలి నరేష్‌ను ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

ప్రజా బాంధవుడిని కోల్పోయాం

● మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
● సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సమద్ నవాబ్ అంత్యక్రియలు


ఆవాల సరోజకు నివాళులర్పిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదముస్లింల పక్షపాతిని, ప్రజాబాంధవుడిని సమాజం కోల్పోయిందని మంత్రి శ్రీధర్‌బాబు, మాజీఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇదారా ఏ ఖాదిమానే మిల్లత్ సెక్రెటరీ అబ్దుల్ సమద్ నవాబ్ అంత్యక్రియలకు హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటన్నారు. పేదల అభిమానాన్ని చూరగొన్న నేతగా, సంఘ సంస్కర్తగా సమద్ నవాబ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. కాంగ్రెస్ సమద్ నవాబ్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఆవాల సరోజ కుటుంబాన్ని పరామర్శించారు. సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

ధర్మపురి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి నిమిత్తం ఇరాక్ దేశానికి వెళ్లి ప్రమాదవశాత్తు మూడు నెలల క్రితం మృతి చెందిన గుర్రం సురేష్ మృతదేహం బుధవారం నేరెళ్ల స్వగ్రామానికి చేరుకుంది. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన గుర్రం సురేష్ జీవనోపాధి నిమిత్తం ఇరాక్ దేశానికి వెళ్లాడు. ఇరాక్‌లోని హేవ కంపెనీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు సెప్టెంబరు 3న మృతిచెందాడు. మూడునెలల తరువాత మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా శవపేటికపై పడి కుటుంబసభ్యులు బోరున విలపించారు. దహన సంస్కారాలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతురులు, తల్లి ఉంది. మృతదేహం రావటానికి ఎంబసీ అధికారులు, రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్రప్రభుత్వ అధికారులు, ఎన్నారై అధికారులు సహకరించారు. ఇందుకోసం సహకారం అందించిన మంత్రి, అధికారులకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి, న్యాయవాది జాజాల రమేష్ తెలిపారు.

అన్నపూర్ణకాలనీలో వీధికుక్కల స్వైర విహారం

● గంట వ్యవధిలోనే ఐదుగురిపై దాడి


కుక్కకాటుకు గురైన చిన్నారి

జ్యోతినగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బుధవారం గంట వ్యవధిలోనే ఐదుగురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడిలో ఈదునూరి బానేష్, ఈదునూరి భాగ్య, గోషిక దుర్గమ్మ, పెగడపల్లి రుద్ర, నర్మదకు గాయాలయ్యాయి. కొంతకాలంగా అన్నపూర్ణకాలనీలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, మున్సిపల్‌అధికారులకు ఎన్నిమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి ఆరోపించారు. తక్షణమే మున్సిపల్ సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్నపూర్ణకాలనీలో పిచ్చికుక్కల బారి నుంచి ప్రజలను రక్షించాలని వారు రామగుండం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌ను కోరారు.

ప్రమాదకరంగా డివైడర్లు..

● తరచూ రోడ్డు ప్రమాదాలు ● సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్


కోరుట్ల బస్టాండులో ప్రమాదకరంగా ఉన్న డివైడర్



రోడ్డు ఇరుకుగా ఉండడంతో డిసెంబరు 2న డివైడర్‌ను ఢీకొట్టిన కారు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు సమీపం నుంచి తెలంగాణ చౌక్ వరకు ఉన్న డివైడర్‌లు ప్రమాదకరంగా మారాయి. చందుర్తి, మల్లారం నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాదారులకు స్వాగతం పలికే కమాన్ సమీపంలో డివైడర్ ప్రారంభం అవుతుంది. డివైడర్ ప్రారంభంలో ఎలాంటి సూచిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో డివైడర్ ఉందని వాహనదారులకు కనిపించకపోవడంతో డివైడర్‌ను ఢీకొంటున్నారు. వాహనదారులు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని, సంబంధిత అధికారులు వెంటనే చీకట్లో వాహనదారులకు కనిపించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు, స్థానిక వ్యాపారులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం రోడ్డు సంఘటనలు..

వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు సమీపంలోని డివైడర్ ప్రారంభం వద్ద ప్రతి నిత్యం వాహనాలు డివైడర్‌ను ఢీకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలకు డివైడర్ కనిపించకపోవడంతో వేగంగా డివైడర్‌ను ఢీకొడుతున్నారని దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. రోడ్డుపైన ఏర్పాటు చేసిన డివైడర్‌లు సైతం పక్కకు జరిగి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

- అక్కనపల్లి వివేక్‌రెడ్డి, వేములవాడ



కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు ప్రమాదకరంగా డివైడర్‌లు ఉన్నాయి. రోజు ఒక సంఘటన జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు వాహనదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలి.

పార్వతీపురంలో నాగుపాము కలకలం


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ జగదీశ్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న వసతిగదులైన పార్వతీపురం వద్ద బుధవారం భారీ నాగుపాము ప్రత్యక్షమై కలకలం సృష్టించింది. కొంతకాలంగా వినియోగంలో లేని వసతి గదిని తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అందులో వస్తువులను తొలగిస్తుండగా ఐదు అడుగుల నాగుపాము ప్రత్యక్షమైంది. వెంటనే ఆలయ పర్యవేక్షకులు శ్రీకాంత్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఎడ్లశివ స్నేక్‌క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించడంతో ఆయన చేరుకొని నాగుపామును పట్టుకొని బయట వదిలేశాడు.

చివరి మజిలీకి తప్పని తిప్పలు

● బ్యాక్ వాటర్‌లోనే అంత్యక్రియలు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో చివరి మజిలీకి సైతం తిప్పలు తప్పడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం గ్రామానికి చెందిన ముదం నర్సయ్య అనే వృద్ధుడు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన శ్మశాన వాటికలోకి మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ చేరడంతో అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నర్సయ్య మృతదేహంతో నీటిలోనే అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


రుద్రవరంలో నీటిలోనే అంత్యక్రియలు చేస్తున్న గ్రామస్థులు

ఏపీపీ రాత పరీక్షను వాయిదా వేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ (ఏపీపీ) రాతపరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి ప్రముఖ న్యాయవాది ముక్కెరరాజు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల14న ఏపీపీ రాత పరీక్షరోజున రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఉన్నాయని, అదేరోజు ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట, తిరిగి మధ్యాహ్నా 2:30నుంచి సాయంత్రం 5:30గంటల వరకు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఏపీపీ రాత పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. ఏపీపీ రాత పరీక్షకేవలం హైదరాబాద్‌లోనే నిర్వహిస్తుండడంతో గ్రామీణప్రాంత న్యాయవాదులు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోతున్నారన్నారు. ఓటు అనేది భారత రాజ్యాంగం కల్పించినహక్కు అని,సద్వినియోగం చేసుకునేందుకు బోర్డుపునరాలోచన చేయాలని కోరారు.

బైండోవర్

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీఎన్నికల నేపథ్యంలో మండలంలోని 24మంది బెల్టుదుకాణాల నిర్వాహకులను బైండోవర్‌చేశారు. మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొంటూ ఎక్సైజ్ అధికారులు వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.

ఓటుకే ప్రాధాన్యం



- నిబంధనలు పాటిస్తేనే మేలు
- ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు

జగిత్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం దక్కుతుంది. ఓటు హక్కు వినియోగానికి ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను పాటిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. అర్హులందరూ ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు. ఈ నెల 11వ తేదీన జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

● జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుం టే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి.

● వీరికే అనుమతి

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు అవకాశం ఉంటుంది. ఓటరు తో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

● టెండర్ ఓటుకు అవకాశం

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49-ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● నిబంధనలు పాటించాల్సిందే..

ఓటు హక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్ని కల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు భద్రత సిబ్బందికి సహకరించాలి. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రామాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువపత్రాలలో ఏదైనాఒకటి తీసుకెళ్తే ఓటువేసేందుకు అవకాశం ఉంది.

● సందేహాలు ఉంటే పీఓకు ఫిర్యాదు చేయాలి

ఓటరుకు ఏమైనా అనుమానాలు సందేహాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారి (పీఓ)కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్య వేక్షించి రెండు గంటలకొకసారి నమోదైన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలి



ఎస్‌యూలో ఎత్నిక్ డేలో పాల్గొన్న ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మన ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని సంస్కృతీ సంప్రదాయాలే మూల స్తంభాలని ఎస్‌యూ వీసీ ఉమేష్‌కూమార్ అన్నారు. బుధవారం యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో ఎత్నిక్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వాణిజ్య, వ్యాపార కళాశాల ఏటా కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. జాతి గౌరవాన్ని పెంపొందించే ఆచారాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వీసీ ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, వాణిజ్య కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూరేపల్లి సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7400 పలికింది. బుధవారం మార్కెట్‌యార్డుకు 62మంది 446క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.6900 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రాజు పర్యవేక్షించారు.

రహదారి ఆక్రమణపై రైతుల రాస్తారోకో



గ్రామస్థులతో చర్చిస్తున్న పోలీసులు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్లుల్ల రోడ్డు నుంచి వ్యవసాయ పనులు, మల్లెతోటలకు వెళ్లే రహదారి ఆక్రమించారని పేర్కొంటూ బుధవారం రైతులు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీనిపై స్పందించిన పోలీసులు అక్కడికి వచ్చి ఎన్నికల అనంతరం దీనిపై చర్చించుకుందామని వారిని సముదాయించి హామీ ఇవ్వడంతో రైతు నిరసన విరమించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మల్లెతోటకు వ్యవసాయ పనులకు దారి ఉండేదని, దానిని కబ్జా చేయడంతో సుమారుగా 300మంది రైతు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవల అక్రమంగా లింకు రోడ్డు కబ్జాకు గురైందని, ప్రవాహం లేని ఎస్సారెస్పీ డీ32 ను రోడ్డుగా అభివృద్ధిచేయాలని, సైనో1094లో గల మేఘనా వెంచర్‌లోని 40 ఫీట్ల రోడ్డు నుంచి మల్లెతోట వరకు రోడ్డు అభివృద్ధి చేసి తమకు రవాణా సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సంగు గంగాధర్, మాజీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్ గౌడ్, అరిసెల రమేష్, బొడ్ల సాగర్, రామకృష్ణ, ఆకుల ప్రవీణ్, రవి, అంజయ్య గాజా రాజారెడ్డి, రాహుల్, సంగు ప్రతిప్, అంజాగౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇండ్లల్లోని ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులో భాగంగా కాంట్రాక్టరు రోడ్డుకు ఇరువైపుల ఎక్సకవేటర్ సహాయంతో మట్టిని తొలగించారు. దీంతో రోడ్డు పక్క నుంచి ఇండ్లల్లోకి వెళ్లే మిషన్ భగీరథ పైపులు తెగిపోయాయి. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమై సువరుగా 15 రోజులు అవుతున్న పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులు, వ్యాపారులకు మిషన్ భగీరథ నీరు అందక, రోడ్డు తవ్వి వదిలేయడంతో ఇంట్లోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల బాలికల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుచిత్ర

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ 17,19విభాగాల్లో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో జగిత్యాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సుచిత్ర తెలిపారు. ఫుట్ బాల్ బీచ్ వాలీబాల్‌లో 10వతరగతి విద్యార్థి అమీనా, అండర్-19 విభాగంలో కో-కో పోటీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్ఫూర్తి, అసోసియేషన్ కబడ్డీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువు తున్న షబానా ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆమె తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సుచిత్ర, పీడీ శ్రీవిద్య, పీఈటీ రమాదేవితో పాటు ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాగాయపల్లి గ్రామస్థులకు నీటి తిప్పలు

● మిషన్ భగీరథ నీరు రాక ప్రజల కష్టాలు



వాటర్ ట్యాంకర్‌తో నీటిని నింపుకుంటున్న గ్రామస్థులు

వేములవాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీరు రాక నాగాయపల్లి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగాయపల్లి గ్రామంలో కొన్నిరోజులుగా మిషన్ భగీరథనీరు అందక ప్రజలు నీటితిప్పలు ఎదుర్కొంటున్నారు. తాగునీటికి, ఇంటి అవసరాలకు వాటర్ ట్యాంకుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పంటపొలాల్లో ఉన్న బోర్ల ద్వారా నీటిని తెచ్చుకొని అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు అందకుండా నీటికి కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికి అధికారులు స్పందించడం లేదని, గ్రామంలో ఉన్న 3 బోరుబావులు నిరుపయోగంగా ఉన్నాయని వాటని సైతం పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యవిధాన పరిషత్‌ను తక్షణమే రద్దు చేయాలి



సూపరింటెండెంట్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీజీఎంఈయూ సభ్యులు

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్‌ను తక్షణమే రద్దు చేయాలని, దాని స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌సర్వీసెస్‌ను ఏర్పాటుచేయాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం యూనియన్ నాయకులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని ఉద్యోగులు సామూహికంగా సంతకాల సేకరణ చేపట్టి ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వాతి మాట్లాడుతూ 1986లో ఏర్పాటైన వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించకపోవడం, వేతన సవరణ సంఘానికి (పీఆర్సీ) వినతులు సమర్పించే అవకాశం లేకపోవడం, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించకపోవడం వంటి కారణాలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సులోచన, సునీత, శోభ, జమున, జ్యోతి, స్నేహ, సుజాత, మమత, శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాణిజ్య పన్నులశాఖలో పనిచేస్తున్న ఏసీటీవోలకు డీసీటీవోగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. బుధవారం తెలంగాణ వాణిజ్యపన్నులశాఖ రాష్ట్రకమిషనర్ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖాళీగాఉన్న డీసీటీవోపోస్టుల్లో ఏసీటీవోలకు ప్రమోషన్లు ఇస్తే రాష్ట్రప్రభుత్వ ఖజానాకు ప్రొఫెషనల్‌టాక్స్ రావడానికి అవకాశం ఉందన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



అవార్డును అందుకుంటున్న పున్నం చందర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన పలువురి ఉత్తమ సేవలకు అవార్డులు వచ్చాయి. బుధవారం హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో గత 15సంవత్సరాలుగా సైకాలజిస్ట్‌గా ప్రజలకు, కార్మికులకు విశేషసేవలు అందిస్తున్న సైకాలజిస్ట్ కనుకుంట్ల పున్నంచందర్ బెస్ట్‌సర్వీస్‌అండ్ సైకాలజిస్ట్ అవార్డుకు ఎంపికయ్యాడు. అదేవిధంగా హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తున్న అల్వాల ఈశ్వర్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా వైస్ చైర్మన్ గడ్డం దివాకర్ ఉత్తమ సామాజిక సేవ అవార్డులకు ఎంపికయ్యారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిలర్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల విజయ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ హనుమాగౌడ్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కన్వీనర్ గాజుల వేణుకుమార్, రాష్ట్ర ఉమెన్ వింగ్ డైరెక్టర్ గజ్జెల కరుణ అవార్డులను ప్రదానం చేసి అభినందించారు.

'నవోదయ' ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఈ నెల 13న నిర్వహించే నవోదయ 6వ తరగతి ప్రవేశపరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 34పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు.

భవిష్యత్ తరాలకు బాటలు వేస్తున్న సీఎం: చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు బాటలు వేసే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచిపోతారని, విద్య, వైద్యం ఉపాధి అవకాశాలపై విజన్ ఉందని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని పార్టీ కార్యాలయంలో బుధవారంవిలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి జరగాలంటే వనరులన్నింటినీ ఉపయోగించుకోవాలన్నారు. తెలంగాణలో మొదటి నుంచి భూ సమస్య ఉందన్నారు. రైజింగ్ తెలంగాణ 2047గ్లోబల్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విషయాలను పొందుపరిచారని, జల్ జంగల్ జమీన్ కొమరంభీం ప్రస్తావన చేయడం, భూమి కోసం భుక్తి కోసం విముక్తికోసం జరిగిన పోరాటంలో వేలాదిమంది అమరత్వం పొందినట్లు చెప్పారన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా మాట్లాడ లేదని, సామాజిక అంశాలపై లోతుగా అధ్యయనం చేశారని అన్నారు. విద్య వైద్యంపై సంపూర్ణ అవగాహన కలిగి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచేందుకు గ్లోబల్ సమ్మిట్ ఉండాలని ముందు చూపుతో వ్యవహరించిన సీఎంను అభినందిస్తున్నామని అన్నారు. స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడంతో కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదని, దాదాపుగా 4వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని అన్నారు. కొంత ఆలస్యంగానైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ఎన్నికల్లో సీపీఐ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్,గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి మధ్య రోడ్డు పక్కన ఉన్న బావి

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి గ్రామాలమధ్య రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. మానకొండూర్-వేగురుపల్లి ప్రధాన రహదారిపై మూల మలుపు ఉండడమే కాకుండా రోడ్డును ఆనుకొని వ్యవసాయ బావి ఉంది. ఈ రహదారి వెంట వేగురుపల్లి, లక్ష్మీపూర్, వెల్ది, లింగాపూర్, జగ్గయ్యపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో కరీంనగర్‌కు వెళ్తారు. వందలాది ఇసుక ట్రాక్టర్లు ఉదయం నుంచి అర్థరాత్రి వరకు నడుస్తూనే ఉంటాయి. బావి వద్ద పెద్ద వాహనాలు ఎదురుగా వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించడానికి సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమ్మక్క భక్తులకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయానికి వచ్చే సమ్మక, సారలక్క జాతర సందర్భంగా వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ భీమన్న ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆలయ అధికారులతో కలిసి విప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో రద్దీ పెరిగినందున అవసరమైన ఏర్పాట్లు వెంటనే పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం ఉచిత దర్శనం, కోడెల క్యూలైన్, కళ్యాణ కట్ట, వీఐపీ రోడ్డు, తదితర క్యూలైన్‌లను పరిశీలించారు. ప్రధానంగా తాగునీటి సదుపాయం, సైన్‌బోర్డులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, మూత్ర శాలలు, స్నానాల గదులు, లైటింగ్ సదుపాయాలు, ఫ్యాన్లు, సీసీకెమెరాలు, డిజైన్స్, సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమ్మక్క జాతర సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు.

జున్ను రాజేందర్‌కు కుల సంఘాల మద్దతు


చల్‌గల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి రాజేందర్

జగిత్యాలరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న కాంగ్రెస్ రూరల్ మండలశాఖ అధ్యక్షుడు జున్ను రాజేందర్‌కు కుల సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. ఆయా వార్డుల్లో బుధవారం ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించగా రాజేందర్ చేస్తున్న సేవలను గుర్తించి అన్నివర్గాల ప్రజలు రాజేందర్‌కు మద్దతు ప్రకటించారు. మరోవైపు రాజేందర్ చల్‌గల్‌లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ఈ మేరకు రాజేందర్ మాట్లాడుతూ గ్రామంలో గల శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ప్రముఖ డాక్టర్ సతీష్‌కుమార్ ఆర్థికసాయంతో 8 గుంటల భూమిని ఆలయానికి కేటాయించడంలో కీలకపాత్ర పోషించినట్లు రాజేందర్ తెలిపారు. అలాగే మాజీమంత్రి జీవన్‌రెడ్డి సహకారంతో చల్‌గల్‌లో ఆంధ్రాబ్యాంక్ ప్రస్తుత యూనియన్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయించానని తెలిపారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండి అభివృద్ధికి పాటుపడే జున్ను రాజేందర్ ఉంగరం గుర్తుపై ఓటు వేసేందుకు ప్రజలంతా ప్రతినభూనడంతో రాజేందర్ విజయం ఖాయమైందనే చర్చ జరుగుతోంది. జున్ను రాజేందర్‌కు మహిళలు, యువత, రైతులు, అన్నివర్గాల ప్రజలు బాసటగా నిలుస్తున్నారు.

ప్రతి పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ.5వేలు అందిస్తా

- ఇందిరానగర్ సర్పంచ్ అభ్యర్థి పూదూరి శ్రీలత రాజ్‌కుమార్

బీర్‌పూర్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా విద్యావంతులైన పూదూరి శ్రీలత రాజ్ కుమార్ బరిలో నిలిచారు. శ్రీలత డిగ్రీ చదవగా భర్త రాజ్ కుమార్ ఎంబీఏ ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరూ విద్యావంతులే. కార్పొరేట్ కంపెనీల్లో లక్షల జీతం, ఖరీదైన జీవితం అనుభవించే అవకాశాలు ఉన్నప్పటికీ నూతనంగా ఏర్పడిన గ్రామంపై మమకారం, గ్రామం అభివృద్ధి చెందాలనే తపనతో రాజకీయ రంగప్రవేశం చేశారు. నూతన గ్రామ పంచాయతీ కావడంతో తనకున్న లక్ష్యాల సాధనకు గ్రామాన్ని ఎమ్మెల్యే సహకారంతో మండలంలోనే ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తానని తనను ఆదరించి కత్తెర గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శ్రీలత రాజ్‌కుమార్ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. గ్రామానికి మొదటి సర్పంచ్‌గా అవకాశం ఇస్తే పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 5వేల రూపాయలు ఇస్తానని, గణపతి మండపం నిర్మించి నిమజ్జనం తర్వాత గ్రంథాలయంగా ఉపయోగిస్తామని, అంబేద్కర్ సంఘ భవన నిర్మాణానికి కృషి, గ్రామానికి కమాన్ ఏర్పాటు, పాఠశాలకు ప్రహరీ, గ్రామంలో వీధి కుక్కల బెడద లేకుండా చూస్తానని ప్రచారం చేపట్టారు.



ప్రచారం నిర్వహిస్తున్న శ్రీలత రాజ్‌కుమార్, శ్రీలత రాజ్‌కుమార్ (ఇన్‌సెట్‌లో)

ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామానికి సేవ చేస్తా

- తుంగూర్ సర్పంచ్ అభ్యర్థి అర్షకోట రాజ గోపాల్‌రావు


ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న రాజగోపాల్‌రావు , రాజగోపాల్‌రావు (ఇన్‌సెట్‌లో)

బీర్‌పూర్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని మేజర్ గ్రామమైన తుంగూర్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సర్పంచ్ బరిలో ఉన్నానని, ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామానికి సేవ చేస్తానని సర్పంచ్ అభ్యర్థి అర్షకోట రాజగోపాల్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న రాజగోపాల్‌రావు ప్రజాప్రతినిధిగా పని చేసిన అనుభవం ఉన్న విషయాన్ని ఓటర్లు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. గతంలో ఆయన చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తు చేస్తున్నారు. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామ పంచాయతీ భవనం, పల్లె దవాఖాన, గ్రంథాలయం, జిమ్ ఏర్పాటు చేస్తానని ఓటర్లకు వివరిస్తూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామంలో దోబీ ఘాట్, సీసీ రోడ్ల నిర్మాణం, కుల సంఘ భవనాల నిర్మాణం కోసం కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇస్తున్నారు. గ్రామాన్ని మోడల్ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రచారం చేస్తున్న అర్షకోట రాజగోపాల్‌రావుకు కేటాయించిన ఉంగరం గుర్తుకు ఓటర్ల నుంచి ఆదరణ పెరుగుతోందనే చర్చ సాగుతోంది.



నేడే తొలి పోరు

(5వ పేజీ తరువాయి)

మల్లాపూర్‌లో 220 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 795 సాధారణం, సమస్యాత్మకంగా 267, క్రిటికల్‌గా 110 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 75 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, 32 పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ల సదుపాయాలను ఏర్పాటు చేశారు.

2,20,147 మంది ఓటర్లు

జిల్లాలో తొలి విడత పంచాయతీల్లో 2,20,147 మంది ఓటర్లున్నారు. ఇందులో మేడిపల్లిలో 24,251 మంది, భీమారంలో 17,577 మంది, కథలాపూర్‌లో 37,724 మంది, కోరుట్లలో 31,243 మంది, మెట్‌పల్లిలో 36,866 మంది, ఇబ్రహీంపట్నంలో 31,383 మంది, మల్లాపూర్‌లో 41,103 మంది ఓటర్లున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ సత్య ప్రసాద్

మొదటి విడత పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశాం. సిబ్బంది సంబంధిత పోలింగ్‌స్టేషన్లకు చేరుకున్నారు. ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించి పోలింగ్ ప్రారంభించనున్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తతో విధులు నిర్వహించేలా సూచనలు ఇచ్చాం. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.

108 వాహనంలో ఆక్సీజన్ అందుబాటులో ఉంచుకోవాలి

మల్యాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ వాహనంలో తప్పనిసరిగా ఆక్సీజన్ అందుబాటులో ఉంచుకోవాలని జగిత్యాల జిల్లా మేనేజర్ యశోద అయిలయ్య సిబ్బందికి సూచించారు. మల్యాలలోని అంబులెన్స్ వాహనం బుధవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో వైద్య పరికరాలు, ఔషధాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. వాహనాలు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి వెంటనే స్పందించి వైద్యం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంట ఈఎంటీ కరుణాకర్, జ్యోతి, పైలట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థులు ఖర్చు చేయాలి

● జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు మనోహర్

ధర్మపురి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నియమ, నిబంధనలు పాటించి ఖర్చు చేయాలని ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు మనోహర్ అన్నారు. ధర్మపురి పట్టణ శివారులో గల రైతు వేదిక వద్ద ధర్మపురి మండలంలో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు గురించి అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు రోజు వారి ఖర్చులకు సంబంధించిన లెక్కలు చూపించి, రిజిష్టర్ మేంటెన్స్ చేయాలని అన్నారు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు మాత్రమే ఖర్చు చేయాలని ఆయన సూచించారు. ఇష్టం వచ్చిన రీతిలో ఖర్చు పెడితే ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను డిస్ క్వాలిఫైడ్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల ఎన్నికల వ్యయ పరిశీలకులు నాగసంకీర్తన్, ఎన్నికల జిల్లా అసిస్టెంట్ అధికారి, ఎంపీడీవో నరేష్, మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, ఏఈవోలు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు


సమావేశంలో పాల్గొన్న అభ్యర్థులు

హామీలు ఇస్తూ.. ఎత్తులు వేస్తూ

● గ్రామల్లో జోరుగా ఎన్నికల ప్రచారం

మల్యాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు అనేక ఎత్తులు వేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం జోరు అందుకోగా గ్రామాభివృద్ధి కోసం అంటూ అభ్యర్థులు అనేక హామీలు ఇస్తూనే నిత్యం ఇంటింటికీ చికెన్, మద్యం సీసాలను అందిస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు స్థానాల అభ్యర్థులు రోజంతా ప్రచారం చేస్తూ రాత్రి వేళల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లి తమను గుర్తుంచుకోవాలని మాంసం, మద్యం అందిస్తున్నారు. రెండో విడత ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరు కుంటున్న తరుణంలో పోలింగ్‌కు ఒక్క రోజు ముందు ఒక్కో ఓటరుకు రూ.వెయ్యి నుంచి మూడు వేల వరకు పంపిణీ చేసేందుకు డబ్బులను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు కొన్ని గ్రామల్లో అభ్యర్థులు భూములు కూడా అమ్ముకోవడంతో సర్పంచ్ ఎన్నికలకు ఎంత ప్రాధాన్యం ఉందో దీన్ని బట్టి తెలుస్తుంది.

ఎన్నికల మరుసటి రోజు ఓడీ కల్పించాలి

రాయికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మరుసటి రోజు ఓడీ కల్పించాలని కోరుతూ ఆర్‌యూపీపీ రాష్ట్ర శాఖ సహాధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఓటర్లు ఎక్కువగా ఉన్న చోట్ల ఎన్నికల ఓటింగ్, కౌంటింగ్ చాలా ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున ఇంటికి చేరుకోవడం, మరుసటి రోజు పాఠశాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని, ఈ నేపథ్యంలో ఎన్నికల మరుసటి రోజు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని కోరారు. రిజర్వ్‌లో ఉన్న పీవోలను అత్యవసర నేపథ్యంలో ఓపీవోలుగా నియమించినవారికి పీవో రెమ్యూనరేషన్ అందజేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అందరికీ ఒకే విధమైన రెమ్యూనరేషన్ చెల్లించాలన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న స్వామి యాదవ్

బాల్యం నుంచే ఆధ్యాత్మికత అలవాటు చేయాలి


మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే పిల్లలకు ఆధ్యాత్మికత అలవాటు చేయాలని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ అడువాల జ్యోతి అన్నారు. జగిత్యాల మండలం దరూర్‌లో శృంగేరి శారద పీటం ఆస్థాన పండితులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మనిషి తనకున్న సమయంలో ఆధ్యాత్మిక చింతనతో గడపాలని అన్నారు. బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి మాట్లాడుతూ ధర్మం మీద విశ్వాసం కోల్పోవద్దని మనల్ని రక్షించేది ధర్మమే అనే విషయం మరచిపోవద్దని బోధించారు. అధర్మ కార్యాల వల్ల ఆయుష్షు క్షీణిస్తుందని అన్నారు. ఈ నాటి కార్యక్రమంలో నిర్వాహకులు చెట్ల చంద్రశేఖర్, జిల్లా శ్రీనివాస్, తవటు రామచంద్రం, మార కైలాసం, బోనగిరి రామనారాయణ, నూనె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బావి తరాలకు ఉపయోగపడే వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులపై చిన్న చూపెందుకని జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇతరులకు పేరు వస్తుందని వైద్య కళాశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బుధవారం జగిత్యాల మెడికల్ కళాశాలను ఆయన సందర్శించారు. అధికారంలోకి వచ్చి రెంపేళ్లు అవుతున్నా కనీస సౌకర్యాలు కల్పించలేదని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే 80 శాతం పూర్తయిన కళాశాల నిర్మాణం పనులు కాంగ్రెస్ అధికారంలోకి ముందుకు కదలడం లేదన్నారు.

బీజేపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలి

రాయికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైతాపూర్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, మాజీ ఎంపీటీసీ రాజనాల మధు, తొగిటి లక్ష్మీనారాయణ, మోత్కూరి శ్రీనివాస్, పడిగెల హరీష్, దొంగ లింగారెడ్డి, కొల్ల కృష్ణారెడ్డి, పాలడుగు ఆనందం, తొంగిట నవీన్, పాలడుగు లింగారెడ్డి, శివనీతి కిష్టయ్య, రమ్య, మహిపాల్, దుంపల రజిత తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన అయిల్నేని ఎర్రారెడ్డి, నారాయణ రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బుధవారం పరామర్శించారు. సానుభూతి వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గుండు దేవయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా మృతుని కుటుంబ సభ్యులను బుధవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, ప్రభుదాస్, లక్ష్మన్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యలో రాణించి విద్యార్థులు ఉన్నత స్థానాలను సాధించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పభుత్వ బాలికల, బాలుర పాఠశాలలతో పాటు సాయిరాంపుర కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌళిక వసతులను పరిశీలించారు.

అయ్యప్ప స్వామికి పూజలు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం గురుస్వామి అవుట్ల లక్ష్మణ్ పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు అంతా సిద్ధం


కథలాపూర్ నుంచి సామగ్రితో తరలుతున్న సిబ్బంది



మల్లాపూర్ నుంచి బస్సుల్లో కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

కథలాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత పంచాయతీ ఎన్నికలు గురువారం జరుగుతున్న నేపథ్యంలో అధికారులు అంతా సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేయగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బందికి పోలింగ్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లు, ఇతరత్రా సామగ్రిని అందజేశారు. 8 రూట్లలో నలుగురు జోనల్ ఆఫీసర్లతో బస్సుల్లో 18 గ్రామాలకు సిబ్బంది తరలివెళ్లారు. అదేవిధంగా కోరుట్ల సీఐ సురేశ్‌బాబు నేతృత్వంలో పోలీసు సిబ్బందిని సమన్వయం చేస్తూ గ్రామాల్లో పటిష్ట బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూట్ అధికా రులుగా గ్రామ రెవెన్యూ అధికారులను నియమించగా జోనల్ అధికారులుగా గెజిటెడ్ అధికారులకు బాధ్యతలు అప్ప గించినట్టు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు.

మల్లాపూర్ మండలంలో...

మల్లాపూర్: మండలంలోని 23 గ్రామ పంచాయతీ సర్పంచ్ 168 వార్డు సభ్యుల ఎన్నికకు అంతా సిద్ధం చేసినట్లు మల్లాపూర్ ఎంపీడీవో శ్రీకాంత్ బుధవారం తెలిపారు. గురువారం జరగనున్న రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలకు 650 మంది పోలింగ్ సిబ్బంది, 130 మంది పోలీసు సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రాలను చేరుకున్నారు. మండలంలోని 220 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. 52 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోనగా మిగతా 168 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నట్లు ఎంపీడీవో వివరించారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పంచాయతీల అభివృద్ధి

ధర్మపురి,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు కోరారు. ధర్మపురి పట్టణంలో బీజేపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాచకొండ యాదగిరిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారానే గ్రామపంచాయితీలకు నిధులు వచ్చి అభివృద్ధి జరుగుతుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్‌రావు, జిల్లా లోకల్ బాడి ఎలక్షన్ ఇంచార్జ్ పొనుగోటి పాపారావు, బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లాకార్యదర్శి బెజ్జారపు లవణ్, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు ఉన్నారు.

జిల్లా సమస్యలపై కేంద్ర మంత్రులకు ఎంపీ వినతి



సమస్యలపై కేంద్రమంత్రులకు విజ్ఞప్తి చేస్తున్న ఎంపి అర్వింద్

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లాకు సంబంధించిన పలు సమస్యలను ఎంపీ అర్వింద్ బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ కార్యాలయంలో కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్‌లను వేర్వేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ పరిధి గుండా పలు రైళ్ల పొడగింపులు, వందే భారత్ సహా, పలు నూతన రైళ్ల మంజూరు, అయ్యప్ప స్వాముల కొరకు కొల్లాంకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. అదే విధంగా కేంద్ర జాతీయ రహదారులు, రవాణాశాఖ మంత్రి గడ్కరీని కలిసి జిల్లాలోని ఎన్‌హెచ్ 61, 63 లలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం, అంబారీపేట, అంతర్గాం గ్రామాల నడుమ ఫ్లైఓవర్‌లు, అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టేందుకు సహకరించాలని కోరారు. మంజూరుకు తక్షణమే మౌఖికంగా హామీ ఇచ్చిన మంత్రి గడ్కరీ, సాంకేతికంగా మంజూరుకు తక్షణ చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికేను సైతం కలిసి బోర్నపల్లి నుంచి జగన్నాథ్‌పూర్ వరకు హైలెవల్ వంతెన బ్రిడ్జి నిర్మాణంకు సహకరించాలని కోరగా, గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రులకు ఎంపి అర్వింద్ కృతజ్ఞతలు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : డీఎస్పీ

వెల్గటూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జగిత్యాల డీఎస్పీ డి. రఘుచందర్ సూచించారు. బుధవారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొదటి విడత ఎన్నికలు కోరుట్ల నియోజక వర్గ పరిధిలో నిర్వహిస్తుండగా జగిత్యాల నియోజకవర్గంలో రెండవ విడత , ధర్మపురిలో మూడవ విడత ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని, గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు ఎటువంటి అల్లర్లకు గొడవలకు పాల్పడకుండా తమ గ్రామ సర్పంచులను గెలిపించుకోవాలని పోలీస్ శాఖ తరుపున విజ్ఞప్తి చేశారు. పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రచారం నిర్వహించుకోవాలని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సిఐ రాంనర్సింహారెడ్డి, వెల్గటూరు ఎస్సై ఉదయ్ కుమార్ లు పాల్గొన్నారు.


వెల్గటూర్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

సర్పంచ్ అభ్యర్థిపై పోస్టర్లు

మల్లాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఓ సర్పంచ్ అభ్యర్థిపై పలు ఆరోపణలతో కూడిన పోస్టర్లు బుధవారం తెల్లవారుజామున కనిపించడం స్థానికంగా చర్చనీయంశంగా మారింది. ముత్యంపేటలో సర్పంచ్ పదవికి ఏడుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. పలు ఆరోపణలతో కూడిన పోస్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు చాలా చోట్ల అంటించడంతో విజయం ఎవరిని వర్తిస్తుందోనని పలువురు ఓటర్లు చర్చించుకుటుంట్టున్నారు.

నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ?

వెల్గటూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఈసారి ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులెవరూ నచ్చక పోతే బ్యాలెట్ పేపర్‌లో చివరన ఉండే నోటా గుర్తుకు ఓటు వేయవచ్చు. మరి బరిలో నిలిచిన అభ్యర్థుల కన్నా ఎక్కువ ఓట్లు నోటాకు వచ్చినా ఎన్నిక రద్దయ్యే అవకాశం లేదు. ప్రస్తుత ఎన్నికల నిబంధనల ప్రకారం నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చినా రెండో స్థానంలో ఉన్న అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. నోటాకు అత్యధికంగా ఓట్లు వస్తే ఆ ఎన్నిక ఫలితాన్ని రద్దుచేసి మళ్లీ పోలింగ్ నిర్వహించాలని గతంలో సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు అయింది. 19 కన్నా తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థులను తదుపరి ఐదేళ్ల పాటు అన్ని ఎన్నికల్లో పోటీ చేయకుండా చూసేలా నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిశీలించిన కోర్టు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. అయినా ఇప్పటివరకు సదరు అంశాల పై ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ప్రలోభాలతో ఎన్నికల ప్రచారం

కథలాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గత వారం రోజులుగా ప్రచారంలో మునిగి ఓటర్లకు గ్రామ శివారుల్లో దావత్‌లు ఏర్పాటు చేసిన అభ్యర్థులు బుధవారం డబ్బు, మద్యం పంపిణీతో ప్రలోభాలకు గురి చేశారు. మండలంలోని 19 గ్రామాలకుగాను రాజారాం తండా గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. ఈ క్రమంలో 18 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటీగా గ్రామాల్లో మహిళలకు చీరలు, ప్రతీ ఓటరుకు వెయ్యి రూపాయలు ఇచ్చి ఓటు అభ్యర్థించినట్టు తెలిసింది. సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు సభ్యులు కూడా ఇంటింటికీ చికెన్, మటన్ పంపిణీ చేశారని సమాచారం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కుల సంఘాలకు మేకలు, గొర్రెలు ఇచ్చి దావత్‌లు ఏర్పాటు చేసే కార్యక్రమాలు పూర్తి చేసుకున్నారు. దీంతో అభ్యర్థుల ఖర్చు తడిసి మోపెడైంది. సిరికొండ, గంభీర్‌పూర్, కథలాపూర్, తాండ్ర్యాల వంటి గ్రామాల్లో అభ్యర్థులు పోటీ పడి ఒక్కొక్కరు రూ. 30 నుంచి 35 లక్షల దాకా ఖర్చు చేశారనే ప్రచారం జరుగుతోంది. పకడ్బందీగా తమ అనుచరులతో పోల్ చీటితో పాటు రూ. 500, వెయ్యి రూపాయల దాకా ఓటరుకు ఇచ్చి మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేశారు. కాగా ఉపసర్పంచ్ పదవి దక్కించుకునేందుకు లక్షల్లో వేలం వేసేందుకు ఆశావహులు సిద్ధం అవుతున్నారు.